సంపుటి :02 సంచిక :300 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శనివారం 07, ఫిబ్రవరి 2026

## ప్రచారానికి అగ్రనేతలు

- రేపు భూపాలపల్లికి సీఎం రేవంత్ రెడ్డి
- నర్సంపేట, మహబూబాబాద్, వర్ధన్నపేటకు కేటీఆర్
- ఎల్లుండి పరకాల, తొర్రూర్ లో కేటీఆర్ ప్రచారం

05

## గెలిపించే బాధ్యత మీది.. అభివృద్ధి బాధ్యత నాది

- మున్సిపాలిటీ అభివృద్ధికి అదనంగా రూ.10 కోట్లు మంజూరు
- తండాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మారుస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి వర్ధన్నపేటలో ప్రచారం

03





# సీతక్క కోటలో పురపోరు

### తొలి మున్సిపల్ సమరం.. ములుగులో ముమ్మర ప్రచారం

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రధాన పోటీ

కొన్ని వార్డుల్లో గట్టి పోటీ ఇస్తున్న బీజేపీ


"రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సొంతగడ్డపై 'పుర' రాజకీయం సెగలు పుట్టిస్తోంది. కొత్తగా ఆవిర్భవించిన ములుగు మున్సిపాలిటీకి జరుగుతున్న తొలి సమరం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి ఈ నియోజకవర్గంపైనే పడింది. ఒకవైపు తన కోటలో పట్టు నిలుపుకోవాలని మంత్రి సీతక్క సైన్యం వ్యూహాలు రచిస్తుండగా.. మరోవైపు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు పావులు కదుపుతున్నాయి. కొన్ని వార్డుల్లో బీజేపీ కూడా తన ప్రభావం చూపిస్తుండటంతో, ములుగు తొలి మేయర్ పీఠంపై ఏ జెండా ఎగురబోతుందన్నది ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతోంది."

– అక్షరదర్బార్, హనుమకొండ

02




- కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా రంగంలో సీతక్క సైన్యం
- బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ప్రచారం
- వారు వన్ సైడేనా? లేక ట్విస్ట్ ఇస్తారా?.. హీటెక్కిన రాజకీయం
- తొలి పీఠం దక్కించుకునేది ఎవరనే అంశంపై ఆసక్తికర చర్చ



## రేపు భూపాలపల్లికి సీఎం రేవంత్

- 'ప్రజాపాలన - ప్రగతి బాట' సభకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్సార్
- ప్రతిపక్షాలపై ఘాటు విమర్శలు

02


## సీఎం రేవంత్‌పై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

వీణా-వాణీలపై వ్యాఖ్యల నేపథ్యంలో ఎంపీ అర్వింద్ యాక్షన్

05

## 425 హుండీల లెక్కింపు రూ.8 కోట్లు దాటిన ఆదాయం

05






### - ప్రచారంలో పోటీ

ఎన్నికల ప్రచారంలో ఇక్కడ ప్రధాన రాజకీయ పార్టీల నేతలు పోటీ పడుతున్నారు. తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులు గడపగడపకు వెళ్లి ఓటర్లను కలిసి అభ్యర్థిస్తుండగా నేతలు కార్నర్ మీటింగ్స్ లో పాల్గొంటున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తో పాటు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తదితరులు తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం సాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా తమ పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారాన్ని ఉధృతం చేశారు. మంత్రి సీతక్క ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారంలోకి దిగక పోయినప్పటికీ తమ పార్టీ అభ్యర్థుల ఎంపిక నుంచి మొదలుకొని ఇక్కడ ప్రచారం నిర్వహణ వరకు ఇంటర్నల్ గా అన్ని తానై కాంగ్రెస్ శ్రేణులను ముందుకు నడిపిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఈ మున్సిపాలిటీ చైర్ పర్సన్ పదవికి వంగ సుమలత పేరు ప్రచారంలోకి వచ్చింది. ప్రధాన పార్టీల పోటీతో మంత్రి సీతక్క ఇలాకలో మున్సిపల్ ఎన్నికల పోరు ఆసక్తి రేపుతుంది. ములుగు మున్సిపాలిటీపై మొదటిసారి ఏ పార్టీ జెండా ఎగరవేయనుందనేది చర్చనీయాశమైంది.

# సీతక్క కోటలో పురపోరు

- తొలి మున్సిపల్ సమరం.. ములుగులో ముమ్మర ప్రచారం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రధాన పోటీ
- కొన్ని వార్డుల్లో గట్టి పోటీ ఇస్తున్న బీజేపీ
- కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా రంగంలో సీతక్క సైన్యం
- బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ప్రచారం
- వారు వన్ సైడేనా? లేక ట్విస్ట్ ఇస్తారా?.. హీటెక్కిన రాజకీయం
- తొలి పీఠం దక్కించుకునేది ఎవరనే అంశంపై

### ఆసక్తికర చర్చ

**అక్షరదర్బార్, హనుమకొండ :**

పురపోరును పురస్కరించుకొని ములుగు మున్సిపాలిటీ రాజకీయంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఎందుకంటే ఇక్కడి నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పన్నెండు మున్సిపాలిటీల్లో ఒక మంత్రి నియోజక వర్గం పరిధిలోని మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగుతున్నది ములుగు ఒకటే కావటం విశేషం. అంతేకాదు కొత్తగా ఏర్పడిన ములుగు మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగుతున్నది కూడా తొలిసారి కావటం మరో ప్రత్యేకత. ఈ మున్సిపాలిటీలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ పార్టీ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపాయి. కొన్ని వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు కూడా గట్టి పోటీ ఇస్తుండటంతో త్రిముఖ పోటీ ఏర్పడింది. మెజారిటీ స్థానాల్లో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య ముఖాముఖి పోటీ నెలకొంది. అయితే నూతనంగా ఆవిర్భవించిన ములుగు మున్సిపాలిటీని ఎలాగైనా కైవసం చేసుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు వ్యూహ ప్రతి వ్యూహాలను అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో మెజారిటీ వార్డులను దక్కించుకోవడానికి ఓట్ల వేటలో పడ్డారు. పోలింగ్ గడువు సమీపించడంతో తమ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు.

### - ప్రతిష్టాత్మకం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12 మున్సిపాలిటీలు ఉండగా వీటిలో ములుగు, స్టేషన్ ఘణపురం, కేసముద్రం కొత్తగా ఏర్పడ్డాయి. దీంతో గతంలో గ్రామపంచాయతీలుగా ఉన్న ఈ మూడు మున్సిపాలిటీలకు తొలిసారి ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే ఉమ్మడి వరంగల్ లో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న మున్సిపాలిటీల్లో ములుగు మున్సిపాలిటీ మాత్రమే మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలో ఉంది. 20 వార్డులు కలిగి ఉన్న ములుగు మున్సిపాలిటీలో మొదటిసారి జరుగుతున్న ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ముఖ్యంగా మంత్రి సీతక్క కోటలోని ఈ మున్సిపాలిటీని అత్యధిక స్థానాలను గెలుచుకోవడం ద్వారా సునాయాసంగా కైవసం చేసుకోగలమనే ధీమాతో కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు. ఈ క్రమంలో వార్ వన్ సైడే అంటున్నారు. ఇక్కడ 20 వార్డులను కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీ కూడా ఎలాగైనా ములుగు మున్సిపాలిటీని గెలుచుకోవాలనే ప్రణాళికతో ముందుకు వెళ్తుంది. ఇందులో భాగంగా 20 వార్డుల్లోనూ తమ పార్టీ అభ్యర్థులను బరిలో దింపింది. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ కు ములుగు మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జి బాధ్యతలు అప్పగించింది. బీజేపీ కూడా ఇక్కడ తమ పార్టీ అభ్యర్థులను పోటీలో నిలిపింది. కొన్ని వార్డుల్లో గట్టి పోటీ ఇస్తుంది.

---



# బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

### మాజీ ఎమ్మెల్యే చల్లా సతీమణి జ్యోతి

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని 13,02 వ వార్డులలో పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కొనసాగాలంటే బిఆర్ఎస్ అభ్యర్థుల విజయం అవసరమని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ఎన్నికల గుర్తైన 'కారు'గుర్తుకు ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని రెండో వార్డు ప్రజలను కోరారు.ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, బిఆర్ఎస్ పట్ల ప్రజల్లో అపారమైన నమ్మకం స్పష్టంగా కనిపిస్తోందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

# కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దు

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 14వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి పడిదెల దీప్తి రాకేష్ గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి, ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతల మాయమాటలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని హెచ్చరించారు.కాంగ్రెస్ వైఫల్యాలకు బుద్ధి చెప్పాలంటే మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. బిఆర్ఎస్ పాలనలోనే పరకాల పట్టణం అభివృద్ధి సాధ్యమైందని గుర్తు చేశారు. ఈ ప్రచారంలో మున్సిపాలిటీ ఎన్నికల కోఆర్డినేటర్, మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# రేపు భూపాలపల్లికి సీఎం

- 'ప్రజాపాలన-ప్రగతి బాట' సభకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్సార్
- ప్రతిపక్షాలపై ఘాటు విమర్శలు

**అక్షరదర్బార్, భూపాలపల్లి :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రేపు ఆదివారం నిర్వహించనున్న "ప్రజాపాలన – ప్రగతి బాట" బహిరంగ సభకు అధికార యంత్రాంగం, కాంగ్రెస్ శ్రేణులు భారీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈ సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. మధ్యాహ్నం చెల్పూర్ సభకు చేరుకునే ముందు, సీఎం రేగొండ మండలం కొడవటంచ గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటారు. ఆలయ పునర్నిర్మాణం కోసం కేటాయించిన రూ.12.15 కోట్ల పనులను సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు గణపురం మండలం చెల్పూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు.

### - సభా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే

శనివారం సాయంత్రం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి సభా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా



ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్షాలపై ఘాటు విమర్శలు చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం తరలిపోతుందంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారంలో నిజం లేదని ఎమ్మెల్యే కొట్టిపారేశారు. ఈ అంశంపై రేపు స్వయంగా ముఖ్యమంత్రితోనే ప్రజలకు హామీ ఇప్పిస్తానని స్పష్టం చేశారు. కేటీపీపీ (జెన్కో) ప్లాంట్‌ను తామే తెచ్చామని చెప్పుకుంటున్న నేతలకు చురకలు అంటించారు. 2006లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే 500 మెగావాట్లు, 2009లో మరో 600 మెగావాట్ల పనులకు పునాది పడిందని గుర్తు చేశారు. గత పదేళ్లలో భూపాలపల్లిలో ఇసుక, బొగ్గు, వైట్ పెట్రోల్ దందాలు పెరిగిపోయాయని, తాము మాత్రం వందల కోట్లతో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఉనికి కాపాడుకోవడానికే విపక్షాలు అబద్ధాలు ఆడుతున్నాయని విమర్శించారు.

# మేడారం 'వెలుగుల విజయోత్సవం'

- విద్యుత్ శాఖ అత్యుత్తమ పనితీరుపై సీఎండీ ప్రశంసలు




అక్షరదర్బార్, హనుమకొండ: మేడారం జాతరలో భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరాను అందించి, మేడారాన్ని 'వెలుగుల మేడారంగా' తీర్చిదిద్దడంలో విద్యుత్ శాఖ అత్యుత్తమ పనితీరు కనబరిచిందని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి కొనియాడారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన 'మేడారం జాతర విద్యుత్ విజయోత్సవం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతర నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. 2024 జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, అంతకంటే మెరుగైన సౌకర్యాలతో ఈసారి జాతరను దిగ్విజయంగా పూర్తి చేశామని, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఏజెన్సీల సమన్వయ కృషి వల్లే ఇది సాధ్యమైందని సీఎండీ అన్నారు. విద్యుత్ అంతరాయాలను అరికట్టేందుకు తొలిసారిగా 33 కేవీ లైన్లలో 'కవర్ కండక్టర్' వ్యవస్థను ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లో అండర్ గ్రౌండ్ కేబుల్, రింగ్ మెయిన్ యూనిట్లను మరింత విస్తరిస్తామని చెప్పారు.

**- ప్రశంసా పత్రాల అందజేత**

మేడారం జాతరలో అసాధారణ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు సీఎండీ వరుణ్ రెడ్డి ప్రశంసా పత్రాలను అందజేశారు. అదే ఉత్సాహంతో భవిష్యత్తులోనూ సంస్థ ప్రతిష్టను పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి మోహన్ రావు, వి తిరుపతిరెడ్డి, టి మధుసూదన్, సీ ప్రభాకర్, మరియు సీఈలు, ఎస్ఈలు, డీఈలు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## సీఎం సభకు భారీగా మహిళల తరలింపు

**సేర్ఫ్ అధికారుల ఆధ్వర్యంలో సమీకరణ**

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: రేగొండ మండలం కోటంచ గ్రామంలో నిర్వహించనున్న సీఎం సభకు మహిళా సంఘ గ్రూపు సభ్యులను అధిక సంఖ్యలో తరలించేందుకు మొగుళ్లపల్లి మండల సేర్ఫ్ అధికారుల నేతృత్వంలో మహిళల సమీకరణలను ముమ్మరం చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్డీఏ పీడీ బాలకృష్ణ వీడియో కాన్ఫరెన్స్లలో అధికారులతో మాట్లాడారు. మొగుళ్ళపల్లి మండలం నుండి 16 బస్సులలో సుమారు 1000 మంది మహిళలను సీఎం సభకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో వీవోకు ఒక బస్సును కేటాయిస్తూ బస్సులో 60 మందిని తరలించాలని సెర్ప్ అధికారులు భావిస్తున్నారు,

## రన్నింగ్ బస్సులో చెలరేగిన మంటలు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- 39 మంది ప్రయాణికులు సేఫ్

అక్షర దర్బార్, హైదరాబాద్ : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. 39 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు కంచికచర్ల మండల పరిధిలోని కీసర టోల్గేట్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెనుక భాగంలోని ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్, వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. ప్రయాణికులందరినీ తక్షణమే కిందికి దిగిపోవాలని కేకలు వేయడంతో, వారు దిగిన కొద్ది నిమిషాల్లోనే మంటలు బస్సు మొత్తం వ్యాపించి వాహనం పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. మొగుళ్లపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామంలో తొలిసారిగా శనివారం గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి దివ్య ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించగా ఈ కార్యక్రమంలో గ్రామ సరిహద్దు గ్రామంలో ఉన్న నీటి సమస్య,డ్రైనేజ్ క్లీన్ చేయడం వీధి దీపాలు ఏర్పాటు చేయడం, సీసీ రోడ్స్ మరియు మోరీలు వేయించడం అందరికీ సమానంగా ప్రభుత్వ పథకాలను అందించడం, అంగన్వాడీ కి సొంతభవనం కేటాయించడం,పశువుల ఆసుపత్రిని పునరుద్ధరణ చేయడం బోరింగులను బాగుచేయడం, అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు, బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చించారు.

## గెలిపించే బాధ్యత మీది..
# అభివృద్ధి బాధ్యత నాది

- మున్సిపాలిటీ అభివృద్ధికి అదనంగా రూ.10 కోట్లు మంజూరు
- తండాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మారుస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి వర్ధన్నపేటలో ప్రచారం




అక్షరదర్బార్, వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నిర్వహించిన రోడ్ షో, కార్నర్ మీటింగ్లలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మద్దతు కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లా ఇన్చార్జి మంత్రిగా వర్ధన్నపేట పట్టణానికి ప్రత్యేకంగా రూ.10 కోట్లు మంజూరు చేయిస్తాను. మున్సిపాలిటీలో విలీనమైన తండాల ప్రజల కోరిక మేరకు, వాటిని తిరిగి గ్రామ పంచాయతీలుగా మారుస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎల్లమ్మ గుడి నిర్మాణాన్ని తన సొంత నిధులతో పూర్తి చేస్తానని మంత్రి ప్రకటించారు. ఏప్రిల్ నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రారంభమవుతుందని, అర్హులైన ప్రతి ఆడబిడ్డకు ఇల్లు మంజూరు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

**- బృహత్తర అభివృద్ధి**

నియోజకవర్గంలో రూ.294 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా పట్టణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, 100 పడకల ఆసుపత్రి, సబ్ జైల్, మున్సిఫ్ కోర్టు, మినీ స్టేడియం నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చెప్పారు. రూ.35 కోట్లతో రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, తన లక్ష్యం కేవలం ప్రజా సేవ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 7వ వార్డులో బీఆర్ఎస్ ప్రచారానికి ఊపు

**స్థానికుడు నాగరాజునే గెలిపించాలి : చల్లా ధర్మారెడ్డి**

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో 7వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ ప్రచారం జోరుగా కొనసాగుతోంది. శనివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బిఆర్ఎస్ అభ్యర్థి దుంపేటి నాగరాజుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, స్థానికుడైన నాగరాజు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడని పేర్కొన్నారు.ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు ముందుండి ఆదుకునే నేస్తం నాగరాజు అని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులు 100 మాటలు చెబుతారని, కానీ మీ మధ్యే ఉండే అభ్యర్థి నాగరాజు మీ సమస్యలను నేరుగా పరిష్కరిస్తాడని స్పష్టం చేశారు.వార్డు అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇస్తూ, బిఆర్ఎస్ అభ్యర్థి దుంపేటి నాగరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని చల్లా ధర్మారెడ్డి ప్రజలను కోరారు.

# అమిత్ షా రాకముందే మావోయిస్టుల 'సరెండర్'

- సుక్మాలో 21 మంది లొంగుబాటు
- వీరిపై రూ. 76 లక్షల రివార్డు..
- భారీగా ఆయుధాలు స్వాధీనం

అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఛత్తీస్గఢ్ పర్యటనకు ముందే మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలో 21 మంది మావోయిస్టులు శనివారం భద్రతా బలగాల ఎదుట సామూహికంగా లొంగిపోయారు. ఛత్తీస్గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'పూనా నార్కోమ్' (కొత్త ఉదయం) పునరావాస పథకానికి ఆకర్షితులై వీరు జనజీవన స్రవంతిలో చేరారు.

**భారీ రివార్డు.. ఆయుధాల అప్పగింత..**

లొంగిపోయిన మావోయిస్టులపై ప్రభుత్వం మొత్తం రూ. 76 లక్షల రివార్డు ప్రకటించినట్లు అధికారులు వెల్లడించారు. వీరు పోలీసులకు లొంగిపోతూ తమ వెంట తెచ్చిన ఎస్ఎల్ఆర్, ఏకే–47 రైఫిళ్లు, బీజీఎల్ లాంచర్లు వంటి అత్యాధునిక ఆయుధాలను అప్పగించారు. బస్తర్ ఐజీ పి. సుందర్ రాజ్, సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్, సీఆర్పీఎఫ్ అధికారుల సమక్షంలో ఈ లొంగుబాటు ప్రక్రియ పూర్తయింది. హింసా మార్గాన్ని వీడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతూ అమిత్ షా పర్యటనలో భాగంగా మరిన్ని కీలక భద్రతా సమీక్షలు నిర్వహించనున్నారు.

# పరకాలకు పదేళ్ల అన్యాయం

- మార్పు కోసం కమలం పిలుపు!
- డాక్టర్ సిరంగి సంతోష్ ప్రచారంతో బీజేపీలో నూతన ఉత్సాహం

అక్షర దర్బార్,పరకాల: పరకాల పట్టణానికి గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, అధికారం లోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిపోయిందని బీజేపీ మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ విమర్శించారు. పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ 12వ వార్డు అభ్యర్థి ఆకుల లవణ్య శ్రీధర్ గెలుపుకై విస్తృత స్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు, 9 వ వార్డులో బెజ్జంకి పూర్ణ చారి గెలుపుకై హనుమకొండ మాజీ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, 59 వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత తో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో పరకాల అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీజేపీ పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్న పార్టీ అని పేర్కొన్న డాక్టర్ సంతోష్ కుమార్, బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే పరకాల పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఓటర్లను కోరారు. డాక్టర్ సంతోష్ కుమార్ ప్రచారానికి రావడంతో పలు కాలనీల్లో ఓటర్లు ఉత్సాహంగా స్పందించారు. "మా డాక్టర్ వచ్చాడు" అంటూ స్వాగతం పలుకుతూ, ఆయన సూచించిన అభ్యర్థులకు ఓటు వేస్తామని పలువురు హామీ ఇవ్వడం విశేషం. డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ చురుకైన ప్రచారంతో పరకాల మున్సిపల్ ఎన్నికల్లో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రచారంలో బిజెపి నాయకులు మార్త భిక్షపతి, నారాయణ దాసు పాల్గొన్నారు.



# 22వ వార్డులో విజయం దిశగా బీజేపీ

## ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్న కొలనుపాక భద్రయ్య

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 22వ వార్డులో బీజేపీ విజయంపై ధీమా వ్యక్తమవుతోంది. బీజేపీ అభ్యర్థి, తాజా మాజీ కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్ల మన్ననలు పొందుతున్నారు. ఈ ప్రచారంలో యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరుస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారంపై హామీ ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కొలనుపాక భద్రయ్య మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ఆశయ సాధనకై వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్నానని, వార్డు ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. 22వ వార్డు ప్రజల నుంచి బీజేపీకి అనూహ్య స్పందన లభిస్తోందని, రానున్న ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని భద్రయ్య కోరారు.



# కాంగ్రెస్ అభ్యర్థులకు కర్రు కాల్చి వాత పెట్టాలి

- ఎమ్మెల్సీ సిరికొండ, మాజీ ఎమ్మెల్యే చల్లా
- పరకాలలో బీఆర్ఎస్ ప్రచారం
- 9న కేటీఆర్ రాక.. భారీ ర్యాలీ



అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల కోసం ఇంటింటికి వచ్చే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తగిన బుద్ది చెప్పాలని ఎమ్మెల్సీ, తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రెండున్నరేళ్ల పాలనలో పరకాలలో ఒక్క శాశ్వత అభివృద్ధి పని కూడా చేయలేదని ప్రశ్నించారు. గతంలో సీఎం కేసీఆర్ చొరవతో పరకాల పట్టణ రూపురేఖలు మారాయని, రోడ్లు, లైటింగ్, వంద పడకల ఆసుపత్రి, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు వంటి అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. బిఆర్ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని వ్యాఖ్యానించారు. అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో పరకాలకు ఒక్క రూపాయి కూడా రాలేదని అన్నారు. ఈ నెల 9న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరకాలకు రానున్నారని, భారీ ర్యాలీ, సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# 17వ వార్డులో బీఆర్ఎస్ కు పూర్తి మద్దతు

## ఆదర్శవార్డుగా తీర్చిదిద్దుతా : రజిని నవీన్

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 17వ వార్డులో బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శనిగరపు రజిని నవీన్ నిత్యం ప్రజల మధ్య ఉంటూ విస్తృత ప్రచారం నిర్వహించడంతో ఓటర్ల నుంచి మంచి స్పందన లభిస్తోంది. శనివారం 17వ వార్డులో బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న రజిని నవీన్, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, వార్డు ప్రజలంతా తనకు పూర్తి మద్దతు అందిస్తున్నారని తెలిపారు. వార్డు అభివృద్దే తన ప్రధాన ధ్యేయమని, 17వ వార్డును ఆదర్శవార్డుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. 17వ వార్డులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉండటంతో పార్టీకి పూర్తి మద్దతు, సహాయ సహకారాలు లభిస్తున్నాయని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో 17వ వార్డులో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.





# అవ్వ ఆశీర్వదించి గెలిపించండి

## మీ ఇంటి బిడ్డగా సేవ చేస్తా..

## 12వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి గంట కళావతి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 12వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి గంట కళావతి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటి ముంగిట బొట్టు పెడుతూ, "అవ్వ ఆశీర్వదించి గెలిపించండి... మీ ఇంటి ఆడబిడ్డగా సేవ చేస్తా" అంటూ ఓటర్లను హృదయపూర్వకంగా అభ్యర్థించారు. 12వ వార్డులో గంట కళావతి చేపట్టిన ప్రచారానికి ఓటర్ల నుంచి విశేష స్పందన లభించింది. "ఎప్పటి నుంచో మమ్మల్ని కలుస్తూ మా సమస్యలను తెలుసుకుంటున్నావు... నీకే మా ఓటు" అంటూ పలువురు ఓటర్లు ఆమెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా గంట కళావతి మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో ప్రజల ముందుకు వచ్చానని, తనను ఆశీర్వదిస్తే 12వ వార్డు అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మీ ఇంటి బిడ్డగా సేవ చేస్తానని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు.

# పట్టణ అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

## ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే రేవూరి



అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరకాల పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అన్ని వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రజలదేనని అన్నారు. పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక డీపీఆర్ ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నూతన డిగ్రీ కాలేజ్, ప్రభుత్వ ఆస్పత్రి, మహిళా డైరీ, దామెర చెరువు అభివృద్ధి వంటి పనులు చేపట్టామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, ఓట్ల కోసం వచ్చే టీఆర్ఎస్, బీజేపీ మాటలను నమ్మవద్దని కోరుతూ పట్టణ అభివృద్ధి కోసం అధికార కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు.

# 11వ వార్డులో కాంగ్రెస్ ప్రచార హోరు

## రాంనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో 11వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గూడెల్లి సదన్ కుమార్ కు మద్దతుగా ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో రాంనగర్ కాలనీలో కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, మహిళలు ఓటర్లను నేరుగా కలుసుకుని చేతి గుర్తుకు ఓటు వేసి గూడెల్లి సదన్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాంనగర్ కాలనీలో కాంగ్రెస్ ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతుండగా, చేతి గుర్తుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది.



# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

**- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**

అక్షరదర్బార్, హనుమకొండ: ఈ నెల 11న వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలకు జరగనున్న ఎన్నికలను అత్యంత పకడ్బందీగా, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, ఘన్‌పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీలకు ఈ నెల 11న పోలింగ్ జరగనుంది. ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణాపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పంచే తాయిలాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా లేదా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా ఉపేక్షించవద్దని, వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ పత్రాల పంపిణీ కేంద్రాల వద్ద, పోలింగ్ రోజున, కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**- నిరంతర పర్యవేక్షణ**

క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ, ఎన్నికల నిబంధనలు అమలయ్యేలా చూడాలని సీపీ ఆదేశించారు. విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్రనాయక్, కవిత, ఏఎస్పీలు శుభం, చేతన్, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, పలువురు ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు. అధికారులు తమ పరిధిలో చేపట్టిన భద్రతా చర్యలను సీపీకి వివరించారు.




# 425 హుండీల లెక్కింపు

**- రూ.8 కోట్లు దాటిన ఆదాయం**

అక్షరదర్బార్, హనుమకొండ: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర హుండీల లెక్కింపు ప్రక్రియ హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో మూడో రోజుకు చేరుకుంది. భక్తులు సమర్పించిన మొక్కులతో వనదేవతల హుండీలు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. శనివారం జరిగిన లెక్కింపులో ఆదాయం గణనీయంగా పెరిగింది. లెక్కింపు ప్రక్రియలో భాగంగా శనివారం అధికారులు మొత్తం 140 హుండీలను తెరిచారు. రూ.2,01,21,440 నగదుతో పాటు 71,283 విదేశీ కరెన్సీ లభించింది. గడిచిన మూడు రోజులలో మొత్తం 425 హుండీల లెక్కింపు పూర్తయింది. దీని ద్వారా ఇప్పటివరకు రూ.8,06,46,359 నగదు ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. మొదటి రోజు 125 హుండీల ద్వారా రూ.2.49, రెండో రోజు 160 హుండీల ద్వారా రూ.3.55, మూడో రోజు 140 హుండీల ద్వారా రూ.2.01 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. కాగా, హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో సీసీ కెమెరాల నిఘా, భారీ పోలీస్ బందోబస్తు నడుమ ఈ లెక్కింపు ప్రక్రియ సాగుతోంది. దేవాదాయ శాఖ అధికారులు, స్వచ్ఛంద సేవకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈసారి జాతరలో మొత్తం 828 హుండీలను ఏర్పాటు చేయగా, ఇంకా సగానికి పైగా హుండీల లెక్కింపు జరగాల్సి ఉంది.

# ప్రచారానికి అగ్రనేతలు

- రేపు భూపాలపల్లికి సీఎం రేవంత్ రెడ్డి
- నర్సంపేట, మహబూబాబాద్, వర్ధన్నపేటకు కేటీఆర్
- ఎల్లుండి పరకాల, తొర్రూర్ లో కేటీఆర్ ప్రచారం

అక్షరదర్బార్, వరంగల్: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ గడువు సమీపించడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశాయి. తమ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అగ్ర నేతలను సైతం ప్రచారంలోకి దింపుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం భూపాలపల్లికి రానున్నారు. ముందుగా ఆయన రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు చేరుకుని ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. అనంతరం భూపాలపల్లి పట్టణ శివారులోని చెల్పూర్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఇదే రోజు ఆదివారం మధ్యాహ్నా 12 గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నర్సంపేటల తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించిన తర్వాత ఆయన 2 గంటలకు మహబూబాబాద్ లో ఎన్నికల ప్రచారం అనంతరం సాయంత్రం 4 గంటలకు వర్ధన్నపేటలో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన నిర్వహిస్తారు. 9న కేటీఆర్ పరకాల, తొర్రూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

# స్కూల్ వ్యాన్ దగ్ధం

- 15 మంది విద్యార్థులు సురక్షితం
- చిట్యాల మండలంలో కలకలం
- విద్యార్థులను అప్రమత్తం చేసిన డ్రైవర్.
- షార్ట్ సర్క్యూటే కారణం.. చూస్తుండగానే బూడిదైన పాఠశాల వాహనం

అక్షరదర్బార్, చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగే గ్రామానికి చెందిన రైజింగ్ స్కూల్ వ్యాన్ శనివారం ప్రమాదానికి గురైంది. విద్యార్థులను తీసుకువెళ్తున్న క్రమంలో జూకల్ గ్రామం సమీపంలోకి రాగానే వాహనంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ప్రమాద సమయంలో వాహనంలో డ్రైవర్‌తో పాటు 15 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంజిన్ నుండి పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్, వెంటనే అప్రమత్తమై విద్యార్థులందరినీ వాహనం నుండి కిందకు దింపేశారు. విద్యార్థులు కిందకు దిగిన కొద్దిసేపటికే మంటలు వ్యాపించి, వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది. రోడ్డుపై వెళ్తున్న వాహనం ఒక్కసారిగా అగ్నిప్రమాదానికి గురవ్వడంతో స్థానికులు, బాటసారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

# సీఎం సభను విజయవంతం చేయండి

**- కాంగ్రెస్ నాయకుడు ఎర్రబెల్లి పున్నం చందర్రావు**



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూపాలపల్లి నియోజకవర్గంలోని కోటవటంచ లో ఆదివారం నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎర్రబెల్లి పున్నం చందర్రావు పిలుపునిచ్చారు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారం వచ్చిన రెండు సంవత్సరాలలో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. రేవంత్ రెడ్డి సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



# డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల కేంద్రంలో డ్రైనేజీ సమస్యను శాశ్వత పరిష్కారం చేయాలని విద్యుత్ దీపాలను పునరుద్ధించాలని ఉపాధి హామీ ద్వారా వంద రోజుల పని నిరుపేదలకు కల్పించాలని గ్రామస్తులు సవా దృష్టికి తీసుకువచ్చారు. శనివారం మొగుళ్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు ఈ సభకు గ్రామ సర్పంచి చాట్ల విజయ రవీందర్ అధ్యక్షత వహించగా కార్యదర్శి నరేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు గ్రామ అజెండాలో పలు సమస్యలు ప్రజలు సభ దృష్టికి తీసుకురాగా మండల కేంద్రంలో డ్రైనేజీ మైక్ సెట్ తదితర విద్యుత్ దీపాలు ఉపాధి హామీ రోడ్ల మరమ్మతులు తదితర అంశాలను దశలవారీగా పరిష్కరిస్తామని సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం కార్యదర్శి నరేష్ ప్రజలు పాల్గొన్నారు

# సీఎం రేవంత్ పై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

**వీణా-వాణీలపై వ్యాఖ్యల నేపథ్యంలో ఎంపీ అర్వింద్ యాక్షన్**



అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి : మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అవిభక్త కవలలైన వీణా–వాణీలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాజకీయాల కోసం రేవంత్ రెడ్డి మానవత్వం మరిచి మాట్లాడుతున్నారని మండిపడుతూ, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ జాతీయ మహిళా కమిషన్ మరియు జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. సీరియస్ పొలిటీషియన్‌గా ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలని, రాజకీయ ప్రయోజనాల కోసం కవలల ప్రస్తావన తీసుకురావడం తగదని అర్వింద్ హితవు పలికారు.

# సాంకేతికతను ఉపయోగించి వ్యక్తిని కాపాడిన ఎస్ఐ

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన వంటేరు ప్రశాంత్ మద్యం సేవించి ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో నుండి వెళ్లిపోయాడు.కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించగా ఎస్సై జె.పరమేశ్వర్ వేగంగా స్పందిస్తూ సాంకేతికతను ఉపయోగించి సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారం గా వెళ్లిపోయిన వ్యక్తి లొకేషన్ ను పట్టుకున్నారు.పెంబర్తి వద్ద ఉన్నాడ ని తెలుసుకొని అక్కడి పోలీసులను అప్రమత్తం చేసి వెంబడించి అట్టి వ్యక్తిని కాపాడారు.పోలీసుల కౌన్సిలింగ్ అనంతరం అట్టి వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించినారు.వ్యక్తి ప్రాణాలు కాపాడటంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించిన స్థానిక శాయంపేట పోలీసులను మండల ప్రజలు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915